ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేసులు

- పోలీసుల వాంగ్మూలాన్నే మార్చేయడం సరికాదు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో వైఫల్యం చెందిన ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు తిరిగి ఆయన మీదే కేసులు పెట్టడం దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి పర్యటనలో జగన్ ప్రయాణిస్తున్న కారు బాయ్నెట్ ఎక్కి కొంత మంది యువత వారి అభిమానం కొద్దీ కూర్చున్నారంటే ప్రభుత్వం ఆయనకు ఎంత భద్రత కల్పించిందో అర్థమవుతోందన్నారు. ఈ పర్యటనలో జగన్ ప్రయాణిస్తున్న కారుకు.. వ్యక్తి మృతి చెందడానికి సంబంధం లేదని సాక్షాత్తూ గుంటూరు ఎస్పీ సతీష్ చెప్పడం అందరికీ తెల్సిందేనన్నారు. కానీ తర్వాత ఆ వాంగ్మూలాల్ని మార్చడంలో కూటమి ప్రభుత్వం తన పంథాని చెప్పకనే చెప్పిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని సాధారణ ప్రజలు, నాయకులపైనే అమలు చేస్తున్నారనుకున్నామని, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులనూ అణచివేయాలనే ఉద్దేశంతో సర్వశక్తులూ ఒడ్డుతున్నారన్నారు. ప్రజల్లో ఆదరణ ఉన్న జగన్‌మోహన్ రెడ్డి వంటి వ్యక్తులకు భద్రత కల్పించడంలో చంద్రబాబు ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం వహించిందన్నారు. ఇలా నిర్లక్ష్యం చేస్తే ఏదో ఒక ఉపద్రవం సంభవిస్తుందని, దానిని ఆసరాగా చేసుకుని వైఎస్సార్‌సీపీ అధినేతను, పార్టీని బలహీన పర్చాలనే దురుద్దేశం చంద్రబాబు అండ్-కో లో ఉందని కుండబద్దలు కొట్టారు. భద్రతను గాలికొదిలేయాలని కంకణం కట్టుకున్న టీడీపీ ప్రభుత్వ దుష్టపన్నాగాన్ని కేవలం రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల వారూ గమనించి ఖండించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ దుశ్చర్యను ఖండించాలని, సత్తెనపల్లి సంఘటనను పరిశీలించి న్యాయన్యాయాలు విశదీకరించాలన్నారు. జగన్ పర్యటనకు సంబంధించిన భద్రతా వైఫల్యంపై ప్రధాని, రాష్ట్రపతి దృష్టి సారించాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో టీడీపీ ప్రభుత్వం మరింత పేట్రేగిపోయే ప్రమాదముందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, 28వ వార్డు కౌన్సిలర్ పాలవలస ఉమా శంకరరావు, చోడిగంజి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామ సర్వేయర్ల పెన్ డౌన్


తహసీల్దార్ అజు రఫీజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

రామభద్రపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్వేయర్లు సోమవారం వారు నల్ల బ్యాడ్జీల ధరించి పెన్ డౌన్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నంబర్ 1 ప్రకారం హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది భవిష్యత్‌పై సమగ్ర నివేదిక సమర్పించాలని, జీఓ ఎంఎస్ నంబర్ 161 ప్రకారం గ్రేడ్ 3,నుంచి గ్రేడ్ 2గా హోదా మార్చినందున పేస్కేల్‌లో తగిన మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.అలాగే అన్ని జిల్లాల్లో సీనియార్టీ జాబితాలను వెంటనే విడుదల చేసి, అర్హత కలిగిన వారందరికీ పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేయాలని అన్నారు. ఇంత వరకు జరిగిన రీ సర్వేకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు.సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 25వ తేదీ నుంచి రిలే నిరాహారదీక్షలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అనంతరం తహసీల్దార్ అజు రఫీజాన్‌కు వినతిపత్రం అందజేశారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి

రేగిడి: ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలో నాగావళి నదీ పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ కృష్ణలత వీఆర్‌ఓలకు సూచించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో వీఆర్‌ఓలతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. నదీ పరివాహక గ్రామాల్లో వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారిగా లక్ష్మి



రామభద్రపురం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా జి.లక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బొబ్బిలి మండలం పక్కి పీహెచ్‌సీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వర్తించిన ఏ.ఎల్.జి.శిరీష వైద్యవృత్తిలో ఉన్నత చదువుల నిమిత్తం గుంటూరు మెడికల్ కళాశాలకు వెళ్లారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి


వీఆర్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ సుధాకర్

బాడంగి: సక్రమంగా విధులు నిర్వర్తించాలని, రైతుల భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ కె.సుధాకర్ వీఆర్‌ఓలకు సూచించారు. మండలంలోని వీఆర్‌ఓలతో తన కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వీఆర్‌ఓల అలసత్వం వల్ల తనతోపాటు ఉన్నతాధికారులకు చెడ్డ పేరొస్తోందని అన్నారు.గ్రామసర్వేయర్లను సమన్వయం చేసుకుని ముటేషన్లకు సంబంధించిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఆదేశించారు. నీటి తీరువా బకాయిల వసూళ్లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. గతంలో ఆన్‌లైన్ కాకపోవడంతో ఆధారాలు లేక నోషనల్ ఖాతాల్లోకి వెళ్లిన భూములకు రైతులు ఆధారాలు చూపిస్తే వాటిని తిరిగి వారి ఖాతాల్లో తర్జుమా చేయాలని సూచించారు. అలాగే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి సదుపాయాలు, సమస్యలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు.పాల్తేరుకు చెందిన రెండు పోలింగ్ కేంద్రాలు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో హైస్కూల్‌లో ఉన్నాయని, వాటిని స్థానిక ప్రాథమిక పాఠశాలలోకి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారని ఆ గ్రామ వీఆర్‌ఓ కృష్ణ తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. హెచ్‌డీటీ ఆర్.ధనం, ఎంఆర్‌ఐ జగదాంబ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


వాడాడలో ప్రచారం చేస్తున్న త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

బాడంగి: త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై మండలంలోని వాడాడ, కోటిపల్లి గ్రామాల్లో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక బొబ్బిలి కమిటీ సభ్యులు సోమవారం ప్రచారం చేశారు.ఈసందర్భంగా కమిటీ అధ్యక్షుడు సీహెచ్.అప్పలనాయుడు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు జగద్గురువని, ఈ విశ్వంలో ఆయన్ని మించిన గురువులెవ్వరూలేరని అన్నారు.శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని చెప్పారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఎం.వెంకటరావు, ఆదిలక్ష్మి గణపతి, పద్మావతి,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి వల్లే సమ్మె


రాజాం సిటీ: నిరవధిక నిరాహారదీక్షలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు


బొబ్బిలి: నినాదాలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరి వల్లే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెకుదిగారని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయుడు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని గత 47 రోజులుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమీపట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కార్మిక సంఘ నాయకులు హరిబాబు, అనీల్, మరియదాసు, కృష్ణ, గణపతి, నర్సింగరావు, మోహనరావు, రామకృష్ణ, ప్రసన్నలక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

బొబ్బిలి: గత 15 ఏళ్లుగా సేవలందిస్తున్న తమని పర్మినెంట్ చేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం నుంచి బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మెకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా టెంట్ వేసుకుని నినాదాలు చేశారు. అత్యవసర విభాగాలైన తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ కార్మికులకు నెలకు రూ.29,200(టెక్నికల్), నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం నిర్ణయించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. డిమాండ్లు నెరవేర్చేవరకూ సమ్మె కొనసాగుతుందని చెప్పారు. ఇంజినీరింగ్ కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మజ్జి ఈశ్వరరావు,తెంటు రవి, ఉపాధ్యక్షుడు పి.లక్ష్మణరావు,కోశాధికారి సిద్ధా మురళి, పలువురు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పండ్ల గొడౌన్లలో తనిఖీలు


రాజాంలోని ఓ పండ్ల గొడౌన్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: ప్రమాదకర కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని వినియోగించి మామిడి, అరటి పండ్లను మాగబెడుతూ పట్టణంలో సాగిస్తున్న పండ్ల వ్యాపారం పై 'ప్రజల ప్రాణాలతో చెలగాటం' శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారులు స్పందించారు. పట్టణంలోని పండ్ల వ్యాపారులకు చెందిన గొడౌన్లపై జిల్లా ఆహార కల్తీ నియంత్రణశాఖ దాడులు చేసింది.వ్యాపారులు వినియోగిస్తున్న రసాయనాలను అధికారులు పరిశీలించారు.రసాయనాల శాంపిల్స్‌తో పాటు అరటి, మామిడిపండ్ల శాంపిల్స్‌ను సేకరించి, హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పరీక్షలు నిమిత్తం తరలించారు. తనిఖీలు నిర్వహించిన జిల్లా ఆహార భద్రత అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారాన్ని, పండ్లను ఎవరు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహార కల్తీ నియంత్రణ శాఖ సహాయ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి ఆదేశాలతో ఈ తనిఖీలు జరిపామని, ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

రేగిడి: సోమవారం స్థానిక భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు సోమవారం ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్, సి.జి.వి.అనూరాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

26 నుంచి నవరాత్రి ఉత్సవాలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ, జ్ఞానసరస్వతీదేవి ఆలయాల వద్ద ఈ నెల 26 నుంచి వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ పి.శ్యామలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేయనున్నట్టు పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు హెచ్చరించారు. మండలంలోని సంగాంలో ఆదివారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.మత్తుపదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని చెప్పారు.మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయంలో హెల్ప్ డెస్క్


హెల్ప్ డెస్క్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్‌టీఓ పద్మనాభం

బొబ్బిలి: మండల, పట్టణ పరిధిలోని ఖజానా కార్యాలయంలో కొత్తగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, ఇకపై అందరు డ్రాయింగ్ ఆఫీసర్లు, రిటైర్డు ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులు వచ్చి సేవలు వినియోగించుకోవచ్చని ఎస్‌టీఓ పి.వి.పద్మనాభం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రెజరీ కార్యాలయ భవనం పైఅంతస్తులో ఉండడంతో పాటు కార్యాలయానికి వచ్చి సేవలు పొందడం కష్టంగా భావించి కొందరు అధికారులు,పెన్షన్‌దారులు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో భవనం సెల్లార్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించామని తెలిపారు. పెన్షనర్లు బయోమెట్రిక్‌తో పాటు ఇతర సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన డ్రాయింగ్ ఆఫీసర్లు, ఇతరులు ప్రతిపాదించిన బిల్లులకు కూడా ఇక నుంచి ఇతరులపై ఆధారపడనవసరం లేదన్నారు. మరికాస్త వెసులుబాటు కోసం 93475 22850 నెంబర్‌కు వాట్సాప్ చేస్తే 24 గంటలూ సేవలందిస్తామన్నారు. ఇప్పటికే రూ.4.04 లక్షల డబుల్ పెన్షన్లను రికవరీ చేశామని చెప్పారు. ఇంకా ఎక్కడైనా డబుల్ సర్వీసు పెన్షన్లు పొందుతున్నట్టయితేపై నెంబరుకు సమాచారమందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ట్రెజరీ పరిధిలో 36 మంది కార్యాలయానికి రాలేని పరిస్థితుల్లో వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేసినట్టు చెప్పారు.

బీటీరోడ్లపై ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు నడపొద్దు

సంతకవిటి: బీటీ రోడ్లపై ఇనుప చక్రాలతో ట్రాక్టర్లను నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దుక్కులు, దమ్ముల కోసం ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు(ఫుల్ వీల్)అమర్చి పొలాలకు తారురోడ్లపై వెళ్లడం వల్ల రోడ్లు పాడవుతాయన్నారు. పొలం దగ్గరకు వెళ్లి ఇనుప చక్రాలు అమర్చుకోవాలని, తారురోడ్లపై ఇనుప చక్రాలతో ట్రాక్టర్లు నడపవద్దని సూచించారు.

మర్యాదపూర్వక కలయిక


సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వాకముల్ల చిన్నంనాయుడు

రాజాం: వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల విభాగం రాజాం నియోజకవర్గ కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, పలువురు సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ వ్యవహారాల రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ విభాగాల కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డిని చిన్నంనాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఎదురవుతున్న సమస్యలతో పాటు పార్టీ కేడర్ పడుతున్న ఇబ్బందులను వివరించారు. పార్టీకోసం కష్టపడేవారికి భవిష్యత్‌లో మంచి స్థానం కల్పిస్తామని, పార్టీ కార్యకర్తలందరికీ గౌరవం దక్కేలా చూస్తామని సజ్జల హామీ ఇచ్చారని చిన్నంనాయుడు తెలిపారు.

వారిపై చర్యలు తీసుకోండి

బాడంగి:

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే రైతులకు అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాల వారిపై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండలకార్యదర్శి ఏ.సురేష్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువకు విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. పాల్తేరు,వాడాడలో ఈ దోపిడీ మరీ ఎక్కువగా ఉందన్నారు. గత్యంతరం లేక రైతులు ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఎంతరేటు చెబితే అంత చెల్లించి విత్తనాలు, ఎరువులు తీసుకువెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఓ వైపు పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు విలవిలలాడుతుంటే ఇలా ఎరువుల దుకాణాల వారు అడ్డగోలుగా దోపిడీకి దిగడం ఎంత వరకు భావ్యమని ప్రశ్నించారు. కొన్ని దుకాణాల్లో బిల్లుల రసీదులు కూడా ఇవ్వడం లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులుపెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయశాఖ అధికారులు స్పందించి ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు.

అధికారులు పారదర్శకంగా సేవలందించాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు


వ్యవసాయశాఖకు సంబంధించిన వివరాలను ఏఓ యశ్వంతరావును అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: అధికారులు పారదర్శకంగా సేవలందించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల సాధారణ సభలో ఆయన మాట్లాడుతూ అధికారులు న్యాయబద్ధంగా పనిచేయాలని, ప్రజలందరి కీ సమానంగా సేవలందించాలన్నారు. మొదట వ్యవసాయ శాఖపై సమీక్షలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏఓ యశ్వంత్‌రావు సభ్యులకు పరిచయం చేసుకున్నారు. ఖరీఫ్ కోసం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 1027 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశామని, విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ హరనాథరావు మండలంలో చేపడుతున్న ఉపాధి పనులను వివరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ స్పందిస్తూ మండలంలో వేతనదారులకు ఎప్పటి నుంచి వేతనాలు జమ కాలేదని ప్రశ్నించగా... మే 10 నుంచి జమ కాలేదని ఏపీఓ బదులిచ్చారు. పౌర సరఫరాలపై సమీక్షలో సీఎస్‌డీటీ చిరంజీవి మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే రేషన్ సరుకులు అందిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ సిరిపురపు మంజు, ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.